క్లుప్తంగా

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.14.79 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకల ద్వారా రూ.14,79,624 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. బుధవారం అర్ధగిరి క్షేత్రంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు. గత సంవత్సరం 2023 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2024 మార్చి 27వ తేదీ వరకు హుండీ ద్వారా వచ్చిన కానుకలను లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారి సాయిసులోచన రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మండలపూజ



స్వామివారికి పూజలు చేస్తున్న రామచంద్ర నాయుడు దంపతులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కలశ ఆరాధన, శక్తి హోమం, పంచామృత అభిషేకం వంటి పూజా కార్యక్రమాలను దేవస్థాన చైర్మన్ గల్లా రామచంద్రా నాయుడు చేతుల మీదుగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గల్లా అరుణకుమారి, పద్మావతి, గౌరనేని రమాదేవి, ప్రముఖ రచయితలు నామిని సుబ్రమణ్యం, సాకం నాగరాజు, రాజశేఖర్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ షేక్‌షావలి

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరులో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి వన్‌టౌన్ ఎస్‌ఐ షేక్‌షావలి తన సిబ్బందితో కలిసి దొడ్డిపల్లె వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర తాయిలాల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్‌ఐ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో నగదు, నగలు తీసుకెళ్లేవారు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు పంపిణీ చేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో బుధవారం లక్కీడిప్ నిర్వహించి ప్రయాణికులకు బహుమతులు పంపిణీ చేసినట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. రాయచోటి, ముళబాగిల్, దొడ్డిపల్లె, తిరుపతి, మేటిమంద, కలికిరి మార్గాల్లో వెళ్లే ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణికుల నుంచి టిక్కెట్లను గిఫ్ట్‌బాక్స్‌లో సేకరించి లక్కీడిప్ నిర్వహిస్తుండటం విదితమే. లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచిన వెంకట్రమణ, జన్నత్‌జాన్, లోకేష్, మల్లికార్జున, బావాజాన్, బాషా, పునీత్, సంజనారెడ్డిలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, మెకానికల్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కోదండరామస్వామి ఆలయంలో అన్ని విభాగాధిపతులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 4న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న ధ్వజారోహణం, 9న గరుడ సేవ జరుగుతాయన్నారు. ఉగాది పండుగ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. 10న హనుమంత వాహనం, 13న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలియజేశారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు
- ప్రచారంలో లౌడ్ స్పీకర్ల మోతపై ఫిర్యాదులు
- జేసీ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలకు నిర్వహణకు సంబంధించి 48 గంటల ముందే ఆర్వో నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి. శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఏఆర్‌ఓ అరుణ, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డితో కలసి చిత్తూరు నియోజక వర్గంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమించిన నోడల్ ఆఫీసర్లతో ఆయన సమీక్షించారు. నిబంధనలను ప్రకారమే రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.వీఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్స్ ఇచ్చే నివేదికలను వ్యయాల కిందకు జమ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఎక్కడగానీ ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షించాలన్నారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలు సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చని, ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత టీమ్ అక్కడికి వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారంలో లౌడు స్పీకర్ల మోత ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, లౌడు స్పీకర్లతో ఎక్కువ సౌండ్ కలిగించే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 17 వరకు జరిగిన ఖర్చులను సంబంధిత పార్టీల ఖాతాలకు జమ చేయాలని, 18 నుంచి అభ్యర్థి, వారి పార్టీకి జమ చేయాలన్నారు. ఈ నెల 16 నుంచి అన్ని టీమ్స్ రిపోర్టులను అప్ డేట్ చేయాలన్నారు. సమావేశంలో గుడిపాల, చిత్తూరు తహసీల్దార్లు విజయలక్ష్మి ,శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓలు రాజశేఖర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివిధ టీమ్స్ నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

భర్త గెలుపు కోసం భార్య ప్రచారం



ప్రజలతో మాట్లాడుతున్న ఇందుమతి

చిత్తూరు కార్పొరేషన్: సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న అందరూ ఆదరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి కోరారు. స్థానిక 12వ డివిజన్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఆమెకు మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు, పార్టీలకతీతంగా వివిధ పథకాల రూపేణా సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాలలోనే జమ చేస్తున్నారన్నారు. అలాగే చిత్తూరు అభివృద్ధికి ఎంతగానో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చిత్తూరు ప్రజలు తన భర్తతో పాటు ఎంపీ అభ్యర్థికి కూడా ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మధురెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు



ముట్టుకూరులో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

- వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ముట్టుకూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 43 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. అదేవిధంగా గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చి మాత్రలు అందజేశారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవం సమయంలో 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తర్వాత 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వావానం ద్వారా తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చుతారని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు అశ్విని, లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

'స్వీప్'తో ఓటర్లకు విస్తృత అవగాహన

- కమిషనర్ అరుణ ఆదేశం



చిత్తూరు అర్బన్: అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో స్వీప్ కార్యక్రమంపై అధికారులతో ఆమె సమీక్షించారు. పోలింగ్ బూత్ స్థాయిలో స్వీప్ కార్యక్రమాలపై ఓటర్లను చైతన్యపరచాలన్నారు. కొత్తగా ఓటుహక్కు ప్రాధాన్యత, నైతికంగా ఓటుహక్కు వినియోగం, ఈవీఎం ఉపయోగంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన బూత్‌లు, సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించి స్థానికులతో మాట్లాడాలన్నారు. సామాజిక మాధ్యమాలను ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్‌ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. బుధవారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత ఎలాంటి ప్రలోభాలకు గురవరాదని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ఎన్నికల ఎమిషన్ ఏర్పాటు చేసిన యాప్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, జేడీఎం సరితారెడ్డి, విజయం కళాశాల కరస్పాండెంట్ తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఏపీఎం రవి తెలిపారు. బుధవారం మండలంలోని దిగువమోదలపల్లె, జొన్నగుకరల, తవణంపల్లె, అరగొండ గ్రామ సమాఖ్య లీడర్లు ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా వజ్రాయుధం లాంటి ఓటును స్వేచ్ఛగా వాడుకోవాలన్నారు. ఓటు హక్కుపై, ఓటు ఎలా అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఓ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.





చిత్తూరు కలెక్టరేట్ : మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి, తవణంపల్లె: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



యాదమరి: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రవిశంకర్ రెడ్డి

యాదమరి: రానున్న శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని 180 మజరా కొత్తపల్లె గ్రామస్తులను చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి కోరారు. ఎన్నికల సందర్భంగా బుధవారం సాయంత్రం 180 మజరా కొత్తపల్లె గ్రామంలో గ్రామస్తులకు గ్రామసభ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఎన్నికల సందర్భంగా ఎవరూ దాడులకు పాల్పడరాదన్నారు. ఎవరైన గొడవలకు ప్రేరేపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదమరి పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: సార్వత్రిక ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎంపీడీఓ శివశంకర్ సూచించారు. మండలంలో కొదలమడుగు సరిహద్దు చెక్ పోస్టును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ కోడ్ అమలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ప్రదేశాల్లో మోడల్ కోడ్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని హెచ్చరించారు. సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: కొదలమడుగు సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

మేము సైతం..జగనన్న సైన్యం



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



పెద్దపంజాణి: రాజీనామా పత్రాలను వెల్ఫేర్ అసిస్టెంటుకు అందజేస్తున్న వలంటీర్లు

- వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యం
- ఉద్యోగాలకు రాజీనామా చేసి స్పష్టం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

వి.కోట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నా, వైఎస్సార్ సీపీ అన్నా గుండెల నిండా అభిమానం నింపుకున్న కొందరు వలంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించి, ఎన్నికల ప్రచారం చేస్తుండటం మొదలైంది. ఇప్పుడా ప్రభావం వీ.కోట మండలంపై కూడా పడింది. బుధవారం మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు దివాకర్, కీర్తి, మణికుమార్, వెంకటేష్ తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఆ లేఖలను ఎంపీడీఓకు అందజేశారు. వారు మాట్లాడుతూ, ఎన్నికల విధులకు హాజరు కారాదనే నిబంధనలు పెట్టారని, దీంతో తాము రాజీనామా చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావాలన్నదే తమ అభిమతమని, తామంతా ఎమ్మెల్యే వెంకటేగౌడ, సీఎం జన్‌మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవడానికి కృషి చేస్తామన్నారు.

వలంటీర్ల సామూహిక రాజీనామా

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 17మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను అందుబాటులో ఉన్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు అందజేసి వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు ప్రచారాలు నిర్వహించకూడదని, మంచి చేసిన ప్రభుత్వానికి తాము వెన్నంటే ఉండాలనే ఉద్దేశంతో వలంటీర్ పోస్టులకు రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇక, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేస్తామని ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో శ్రీనివాసులు రెడ్డి, ప్రవీణ, హంసవేణి, నాగరాజు, తేజశ్రీ, వేదవతి, అనూష, యారబ్, రజీవుల్లా, మన్సూర్, షహీంషా, సాదిక్, ఖాజా, పావని, రమణప్ప, పుష్పలత, వినోద్‌కుమార్ ఉన్నారు. జగనన్నకు అండగా నిలిచిన వలంటీర్లను గ్రామస్తులు అభినందించారు.

రొంపిచెర్లలో ఇద్దరు..

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు. కెఎస్. దళితవాడకు చెందిన వలంటీర్ శశికుమార్, దద్దాలవారిపల్లెకు చెందిన శివప్రసాద్ తమ రాజీనామా లేఖలను గురువారం ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారికి అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాము రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.

మా ఆయనను గెలిపించరూ..

గుడుపల్లె: గ్రామాలలో పేదల కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పథకాలతో వెలుగులు నింపారని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. బుధవారం మండలంలోని కోటపల్లెలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్తను, అలాగే ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ప్రభుత్వంలో పేదలను నాయకులు పట్టించుకున్న పాపానపోలేదని, పథకాల ఫలాలన్నీ అప్పనంగా ఆరగించారని విమర్శించారు. జగనన్న పాలనలో నేరుగా అర్హుల ఇళ్లకే పథకాలు చేరాయన్నారు. భరత్ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నారని, మీ ఇంటి బిడ్డగా భావించి భరత్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని, రానున్న ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాన్‌కు వేయాలని కోరారు.



కోటపల్లెలో ప్రచారం చేస్తున్న దుర్గ

పల్లెల్లో కేంద్ర బలగాల కవాతు

పూతలపట్టు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. మండలంలోని ఎగువ, దిగువ పాలకూరు, రంగంపేటక్రాస్, పేటాగ్రహారం, తలపులపల్లె, పోటుకనుమ, కర్ణంవారిపల్లిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుదర్శన ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చనే భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీ కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో. .

తవణంపల్లె: త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో ధైర్యం, నమ్మకం కల్పించడానికే కేంద్ర బలగాలతో పల్లెల్లో కవాతు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తవణంపల్లె ఎస్‌ఐ పి.వి.సుధాకర్ రెడ్డి తెలిపారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రవిశంకర్ రెడ్డి పర్యవేక్షణలో బుధవారం మండలంలోని కె.పట్నం, దిగువమోదలపల్లె, కర్ణంవాండ్లవూరు, కొత్తగొల్లపల్లె, నారసింహనపల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాత్తు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





పూతలపట్టు: కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, తవణంపల్లె: కె.పట్నంలో కేంద్ర బలగాల కవాతు

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం..!

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట నుంచి కావేటిగారిపల్లె పంచాయతీ వరకు అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు దాదాపు 1000 మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి రావాలని, అలాగే పుంగనూరు శాసన సభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, జేఏసీ కన్వీనర్ ముర్వత్ బాషా, ఆనంద, రాయల్‌మోహన్, చంద్రశేఖరరెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, రాజమూర్తి, వాసుదేవరెడ్డి, రవీంద్రనాదరెడ్డి, మునస్వామి, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు